


కలిదిండి జయ




అందరికీ సూర్యుడు ఉదయించినప్పుడు తెల్ల వారుతుంది. కాని ఆ ఎరుపురంగు వెలిసిన పాత మేడలో సూర్యుడు అస్తమించేటప్పుడు తెల్ల వారుతుంది. సాయంత్రం అక్కడ వరండా అర పిల్లల వెకిలి నవ్వులతో, సెక్స్ జోకులతో, పూల వాసనలతో, చవుకబారు సెంటుతో, కరకు గొంతులతో, బండబూతులతో, గలగల లాడుతూ వుంటుంది.

కామిని ఐదుగంటల ప్రాంతంలో కళ్ళువిప్పింది. కాని లేవాలన్పించ లేదు. బద్ధకంగా మంచం మీదే అటూ ఇటూ దొర్లుతోంది. గడిచిన రాత్రుల అనుభవాలు గజిబిజిగా, ముళ్ళ పొదల్లా, కాంప్లె క్స్‌లా అల్లుకుని పోయాయి, ఆమె జ్ఞాపకాల నిండా. ఆ అనుభవాల నిండా ముళ్ళే కాకుండా పువ్వులు కూడా మొలిచి వున్న మాట నిజం.

కామినిది దేవదాసీల వంశం. ఆమెకి తన తండ్రి ఎవరో తెలీదు. ఆమె తల్లికీ తన తండ్రి ఎవరో తెలీదు. తండ్రులు తెలీని తల్లుల వ్యవస్థలో పుట్టింది కామిని. కామినితో పాటు ఆ ఎర్ర మేడలో నివసిస్తున్న మరికొంత మంది అమ్మా యిలు కూతుళ్ళను పోషించలేని తండ్రుల వ్యవ స్థలో, అమ్మాయిల వయస్సుని అమ్ముకునే వ్యాపార వ్యవస్థలో పుట్టారు.

కామిని ఇంకా మంచం మీదే బద్ధకంగా అటూ ఇటూ దొర్లుతూంది. బయట్నుంచి మిగతా అమ్మాయిల నవ్వులు, చిన్నగా కేకలు, ఈల పాటలు విన్పిస్తున్నాయి.

బొమ్మ జెముడు పొదని ఇక్కడ నీళ్ళ చెరువు పక్కనించి పీకి 'థార్' ఎడారిలో పాతినా, నీళ్ళు దొరక్కపోయినా, చావడం మాత్రం చేయదు. అక్కడి ఎకలాజికల్ పరిసరాలకి అనుగుణంగా రూపాంతరం చెందుతుంది. పూలు కూడా పూయించుకుంటుంది. ఎడాప్షన్ చెట్టు చేమలకే కాదు. మనుషులకీ తెలుసు. ఒక వృత్తి, ఒక జీవితం జుగుప్సాకరంగా, నీచంగా, నెగటివ్‌గా ఎప్పుడూ ముద్రపడి వుండదు. ప్రతి వృత్తికి ప్రతి జీవితానికి గాలీ, వెలుతురూ, నీరూ అందు తూనే వుంటాయి. 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్'లో రూపాంతరం చెట్టుకీ, పుట్టకీ, పక్షికీ, జంతువుకీ గాదు మనిషికీ అవసరమే. సోకాల్డ్ నీతులు, ప్రవచనాలు మానవ చరిత్రలోని ఈ ప్రకారణాన్ని మార్చలేవు.

రాజమ్మ హడావిగా, కామిని రూములోకి గాలి సుడిగుండంలా ప్రవేశించింది.

"లేవాలి కామినీ యివ్వాళంతా నీదే అదృష్టం. నోటుల చిలక ఒకటి నీకోసరం ప్రత్యేకంగా వచ్చింది లే" అంది కిళ్ళీ నములుతూ–నవ్వుతూ చేతులు ఆడిస్తూ.

కామిని లేచింది.

"చాలా పెద్ద బేరమనుకో. కొత్త గాబోల్ను. స్నేహితుడు ఎవడో నిన్ను ఘట్టిగా రికమెండు చేశాట్ట. ఒక్కసారి గట్టిగా పట్టావంటే - మళ్ళీ మళ్ళీ ఎటు తిరిగినా-ఆ నోట్ల చిలక ఈ గూటికే చేరాలి" స్నానం చేయడానికి బయల్దేరింది కామిని.

"ఈ రోజు కష్టపడు. రేపు నీకు శెలవు. ఈనాముగా యిచ్చేస్తా. మెడికల్ చెకప్ చేయించు కుందువు గాని. సరోజకి కబురంపాను. అదీ ఈపాటికి వచ్చేస్తూ వుండాలి. ఎందుకూ - నువ్వు స్నానం పూర్తి చేసేసరికి అదిక్కడ వుంటుంది. పెద్ద కేసు కదా–మరందుకని అలంకరణ అదీ నాజూగ్గా, స్పెషల్‌గా వుండాలి సుమా. రోజూలా కాదుగా అందుకే సరోజని పిలిపిస్తున్నా. అది మాంచి మేకప్పు కొట్టేస్తుందిలే నీకు" అంది గర గరలాడే స్వరంతో పారపట్టిన పళ్ళతో చిన్నగా యికిలిస్తూ.

కామిని బాత్రూం తలుపు లేసుకుంది.

'రేటు పెరిగితే అలంకరణ స్థాయి పెరుగు తుంది. సరుకుని నాజూగ్గా తయారు చేస్తారు. అలంకరణ హెూరు చూసి, సరుకు నాజూకుదనం బట్టి రేటు పెరుగుతుంది,' ఈకొనుగోలు-అమ్మకం సూత్రం రాజమ్మకు బాగావే తెల్సు. అందుకే బ్యూటీషియన్ సరోజని పిలిపించింది.

*

నోటుల చిలకని అటు ఐదింటికి పంపి, పడు కున్న కామినికి ఎందుకో ఎనిమిది అవుతుండగా మెళకువ వచ్చింది. మళ్ళీ తిరిగి నిద్ర పట్ట లేదు.

ఆమె లేచి కిటికీ దగ్గర నిల్చుంది. ఇద్దరు ముత్తయిదువలు సజ్జలో కొబ్బరికాయలు, అగరు వత్తులు, అర్టిపళ్ళు పట్టుకుని వెళుతున్నారు. 'గుడికి కాబోల్ను' అనుకుంది కామిని. గుడి జ్ఞాపకం రాగానే దేవుడు జ్ఞాపకం వచ్చాడు. ఎందుకనో ఆమెకి దేవుడి దగ్గరకి వెళ్ళాలన్పిం చింది.

కామిని గుడి ఆవరణలో అడుగు పెట్టేసరికి అక్కడ హడావుడి, కలకలం ఆమెని తాకాయి.

'ఈ రోజు పర్వదినం కాదు. పండగా కాదు. ఎప్పుడూ యిద్దరు, ముగ్గురుకన్నా ఎక్కువ వుండని ప్రశాంతమయిన చోటుని ఎలా హడావుడి, గందరగోళం కల్మష పరిచాయి,' అనుకుంది.

జోళ్ళు బయట విడిచి లోపలికి వెళ్ళింది. దేవుడు రోజూ సాదా గుడ్డలతో వుండేవాడల్లా, ఆ రోజు జరీ అంచు పట్టు పీతాంబరం, అత్తరు కొట్టుకుని మరీ ధరించాడు. బంగారు నగలు, వజ్రాల పతకం అలంకరింప బడి వున్నాయి. పూజారిగారు యింకా ఫైనల్‌గా ఏవో చెమ్కీలు అవీ పెట్టి దేవుడ్ని ముస్తాబు చేస్తున్నారు.

''ఏమిటీ, ఈ హంగూ ఆర్భాటం?'' అంది స్తంభం వెనుగ్గా చేతులు కట్టుకుని నిల్చున్న యువకుడ్ని.

అతను వ్యంగ్యంగా నవ్వుతూ - ''మినిష్టరు వస్తున్నారని దేవుడు ముస్తాబు అవుతున్నారు,'' అన్నాడు.

కామిని మనసుని ఎవరో చరిచినట్టయ్యింది. బయటకి వచ్చింది. జోళ్ళు కనిపించ లేదు. నగ్న పాదాలతోనే నడక ప్రారంభించింది.

ఆమెకి పదే పదే పూజారి ముస్తాబు చేస్తున్న దేవుడు జ్ఞాపకం వస్తున్నారు. మరుక్షణం తనని ముస్తాబు చేసిన సరోజ జ్ఞాపకం వచ్చింది. దేవుడు మినిష్టరు కోసం అలంకారాలు చేసుకొని ఎదురు చూస్తున్నాడు. తను డబ్బున్న వాడికోసం అలంకారాలు చేసుకుని ఎదురు చూస్తుంది.

డబ్బున్నవాడు రావడం వలన తన స్థాయి పెరిగి, రేటు పెరుగుతుంది. మినిష్టరు రావడం వలన పబ్లిసిటీ పెరిగి దేవుడికి గిరాకీ హెచ్చి, రేటు పెరుగుతుంది. అందుకే తనకీ అలంకరణ. మరందుకే దేవుడికా అలంకరణ. 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్' సూత్రంలో తిరుగుతున్న ఈ కమర్షియల్ ప్రపంచంలో బ్రతకాలంటే రూపాంతరం చెట్టుకీ, పుట్టకీ, పక్షికీ జంతువుకీ, మనిషికీ కాదు. దేవుడికి కూడా అవసరమే. అదుకే దేవుడి దర్శనానికి టిక్కట్సు, దేవుడి ముందు కొబ్బరి కాయ కొట్టడానికి టిక్కట్సు, దేవుడికి హారతి కర్పూరం వెలిగించడానికి టిక్కట్సు.

కామిని బుర్రలో సరోజ—పూజారి.

నోటుల చిలక—మినిష్టరు.

తను — దేవుడు—

జయింట్ వీల్‌లా ఒక రౌండు తిరిగింది. అమెకి నవ్వొచ్చింది. వెనుదిరిగి దూరం నించి కనబడు తున్న గుడి గోపురాన్ని చూస్తూ ''డబ్బు, పవర్ చేజిక్కించుకున్న వాళ్ళకి — వాళ్ళకి నచ్చే విధంగా, వాళ్ళ స్టేటస్‌కి తగినట్టు స్పెషల్ అలంకరణలు చేసుకుని ఎదురు చూస్తున్నావు నువ్వు. దేవుడుగా నువ్వు ఈ కమర్షియల్ ప్రపంచంలో భోగంగా బ్రతకాలంటే అంత కంటే మార్గం లేదు. అలాగే నేను కూడా—దేవుడా! మనిద్దరిదీ ఒకటే వృత్తి—'' అని గొణుక్కుంది కామిని వెలిసిన ఎర్రమేడ వైపు నడుస్తూ □

---

రెండు సంవత్సరాల క్రితం కాబోల్ను మన రాష్ట్రపతి వస్తున్నారని తిరుపతి వెంక టేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారాలు చేశారు. ఆ రోజున ప్రత్యేకంగా రాష్ట్రపతి పేరు మీద అభిషేకాలు జరిగాయి. సామాన్య ఖ్యా భక్తులకి ఆ రోజు స్వామివారి దర్శనం దుర్లభం అయ్యింది. ఈ సంఘటన నాలో చిన్నప్పుడు విజయవాడ మొగల్రాజపురం వీధుల్లో చూసిన ప్రాస్టిట్యూట్స్ గురించిన సంఘటనల్ని జ్ఞాపకం చేసింది. ఈ రెండు సంఘటనలకి గల దగ్గర పోలిక నన్ను ఆలోచల్లోకి నెట్టింది. నేను నాస్తికురాల్ని - దేవుడు అనే మత్తు అవసరం లేనంత ఎలర్ట్‌గా మనం ఎదగాలని భావించే వ్యక్తిని. గిరీశం లాంటి యాంటీనాచ్‌లకి వ్యతిరేకిని - వేశ్యని మంచిగా చూడగలిగే స్థాయికి మనం ఎదగాలని భావించే యిండివిడ్యువల్ని. వాళ్ళు ఆ వృత్తి నించి బయటపడి మనకి దగ్గరగా మనలో మనంగా వచ్చేయగలిగే పరిస్థితులు రావాలని



నాలో ఘట్టిగా ఒక ఆశ వుంది. అయితే ఈ కమర్షియల్ ప్రపంచంలో దేవుడికి తన ఎగ్జిస్టెన్స్ నిలుపుకోవాలంటే – పవరున్నవాళ్ళ ప్రాపకం అవసరం. అలాగే వేశ్యకి తన మనుగడ సాగించుకోవాలంటే డబ్బున్న విటులు అవ సరం. ఈ విషయంలో ఏదన్నా తప్పుంటే అది ఈ ప్రపంచాన్ని కమర్షియల్‌గా మార్చిన వాళ్ళదిగాని - దేవుడిది - వేశ్యది కాదు.

– కవివిండి జయ

---

